సాక్షి శ్రీసత్యసాయి జిల్లా

మంగళవారం । 30 । సెప్టెంబర్ । 2025



చీనీ టన్ను రూ.16 వేలు

అనంతపురం మార్కెట్‌యార్డులో సోమవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.16 వేలు పలికాయి.



టమాట కిలో రూ.19

అనంతపురం కక్కలపల్లి మండీలో సోమవారం కిలో టమాట గరిష్ట ధర రూ.19 పలికింది. కనిష్టం రూ.10, సరాసరి రూ.14 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
33.8°/20.6°

జిల్లా పరిధిలో సోమవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తేలిక పాటి నుంచి తుంపర్లు పడ్డాయి. నైరుతి నుంచి పశ్చిమ దిశగా గంటకు 8 నుంచి 14 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

అర్జీలకు నాణ్యమైన పరిష్కారం చూపండి

- కలెక్టర్ ఏ.శ్యాం ప్రసాద్



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్ ఏ.శ్యాం ప్రసాద్

ప్రశాంతి నిలయం: ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అందే అర్జీలకు నాణ్యమైన పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ ఏ.శ్యాం ప్రసాద్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. కలెక్టర్ ఏ.శ్యాం ప్రసాద్, ఇతర అధికారులతో కలసి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా 246 అర్జీలు అందగా.. వాటిని పరిష్కారం కోసం సంబంధిత శాఖలకు పంపించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల వినతులను అధికారులు క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించిన పిదప నాణ్యమైన పరిష్కారం చూపాలన్నారు. అర్జీల పరిష్కారంలో పారదర్శకత ముఖ్యమన్నారు. పెండింగ్ లేకుండా నిర్ణీత గడువులోగా పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, ఇన్‌చార్జ్ డీఆర్‌ఓ సూర్యనారాయణరెడ్డి, పుట్టపర్తి ఆర్డీవో సువర్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యకరమైన అలవాట్లతో గుండె పరిరక్షణ



గుండె పరిరక్షణపై అవగాహన కల్పిస్తున్న వరల్డ్ హార్ట్ ఫెడరేషన్ సభ్యులు

ప్రశాంతి నిలయం: ఆరోగ్యకరమైన అలవాట్లతో హృదయాన్ని పరిరక్షించుకోవచ్చునని వక్తలు అన్నారు. వరల్డ్ హార్ట్ ఫెడరేషన్, సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం ప్రపంచ హృదయ దినోత్సవ వేడుకలు పుట్టపర్తిలో ఘనంగా జరిగాయి. సత్యసాయి శత జయంతి వేడుకలను పురస్కరించుకుని ఈ వేడుకలను నిర్వహించారు. సత్యసాయి మహాసమాధి చెంత ప్రత్యేక పూజల అనంతరం వేడుకలను ప్రారంభించారు. సత్యసాయి విద్యాసంస్థల విద్యార్థులు, గుండెవైద్య నిపుణులు, మేధావులు ర్యాలీగా ప్రశాంతి నిలయం నుంచి హిల్‌వ్యూ స్టేడియం చేరుకున్నారు. హృదయాకారం ఏర్పాటు చేసి.. గుండె ప్రాధాన్యతను వివరించారు.

స్తంభించిన వైద్యసేవలు



- డిమాండ్ల సాధనకు పీహెచ్‌సీ వైద్యుల నిరసన
- జిల్లావ్యాప్తంగా ఆస్పత్రుల్లో వైద్య సేవలు బంద్
- తీవ్ర అవస్థలు పడిన గ్రామీణ రోగులు
- కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యంపై సర్వత్రా విమర్శలు

పుట్టపర్తి అర్బన్: జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల(పీహెచ్‌సీలు)లో సోమవారం ఓపీ సేవలు బంద్ అయ్యాయి. తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం ఈ నెల 26 నుంచి నిరసన కార్యక్రమాలు చేపడుతున్న పీహెచ్‌సీ వైద్యులు సోమవారం సమ్మెలోకి వెళ్లి ఓపీ సేవలకు దూరంగా ఉన్నారు. అసలే సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయి. ఇలాంటి సమయంలోనే డాక్టర్లు నిరసనకు దిగడంతో గ్రామీణ ప్రాంత ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఆస్పత్రులకు వచ్చిన రోగులకు స్టాఫ్‌నర్సులు, ఫార్మసీ సిబ్బంది పారాసిటమాల్, ఇతర మందులను ఇచ్చి పంపించేశారు.



వైద్యుల సమ్మెతో నల్లచెరువు పీహెచ్‌సీలో తెరచుకోని వైద్యాధికారి గది



వైద్యులు సమ్మెలోకి వెళ్లడంతో చిలమత్తూరు పీహెచ్‌సీలో కడుపు నొప్పితో బాధపడుతూ మంచంపైనే పడుకున్న ఏడు నెలల గర్భిణి



నల్లరిబ్బన్ ధరించి నిరసన తెలుపుతున్న ఎనుములపల్లి పీహెచ్‌సీ వైద్యురాలు మునిచంద్రిక

కూటమి సర్కారు నిర్లక్ష్యం..

గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు పీహెచ్‌సీలే దిక్కు. జిల్లాలో 41 పీహెచ్‌సీలు, రెండు కో-లొకేటెడ్ పీహెచ్‌సీలు, రెండు పీపీ యూనిట్లు ఉన్నాయి. వీటిలో రోజూ వేలాది మంది పేదలు వైద్యసేవలు పొందుతున్నారు. ఇందులో 90 మంది వైద్యులు విధులు నిర్వర్తిస్తున్నారు. వీరంతా సమ్మెలోకి వెళ్లడంతో గ్రామీణ వైద్యసేవలు స్తంభించాయి. ఉదయం ఎనిమిది గంటల నుంచే డాక్టర్లు సమ్మెలోకి వెళ్లారు. ప్రతి డాక్టరూ నల్లరిబ్బన్ ధరించి ఆస్పత్రికి వచ్చి.. కేవలం అత్యవసర కేసులు మాత్రమే చూశారు. కాగా, తమ న్యాయమైన డిమాండ్లను తీర్చాలని పీహెచ్‌సీల వైద్యులు చాలా రోజుల నుంచి కోరుతున్నా కూటమి ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. ఆంధ్రప్రదేశ్ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర డాక్టర్ల అసోసియేషన్ (ఏపీపీహెచ్‌సీడీఏ) ఆధ్వర్యంలో నిరసనలు చేపడుతున్నా సర్కారు స్పందించకపోవడంతో సమ్మె ప్రారంభించారు. ఈ క్రమంలోనే ఈ నెల 30న మంగళవారం జిల్లా కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలు, అక్టోబరు ఒకటో తేదీన ర్యాలీలు, మూడో తేదీన విజయవాడలో నిరసన, నిరవధిక నిరాహార దీక్షలు చేపట్టనున్నట్లు అసోసియేషన్ సభ్యులు చెప్పారు. అప్పటికీ కూటమి ప్రభుత్వం దిగిరాకపోతే సమ్మెను ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

పీహెచ్‌సీ వైద్యుల డిమాండ్లు ఇవీ..

- టైం బౌండ్ ప్రమోషన్లు ఇవ్వాలి. 20–25 ఏళ్ల నుంచి ఒకే హోదాలో పని చేస్తున్న వైద్యాధికారులకు న్యాయం చేయాలి.
- ఇన్-సర్వీస్ పీజీ కోటాను పునరుద్ధరించాలి.
- నోషనల్ ఇంక్రిమెంట్లు మంజూరు చేయాలి. గిరిజన ప్రాంతాల్లో సేవలందిస్తున్న వైద్యులకు 50 శాతం మూల వేతనం గిరిజన భత్యంగా ఇవ్వాలి.
- చంద్రన్న సంచార చికిత్స కార్యక్రమానికి రూ.5 వేలు భత్యం ఇవ్వాలి.
- స్థానికత, పట్టణ వైద్యాధికారుల సర్వీస్ అర్హత సమస్యలను, ఇతర దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించాలి.
- కచ్చితమైన పని గంటలు, వారాంతపు సెలవు, వైద్యుల జాబ్‌చార్ట్ నిర్ణయించాలి.
- స్టాఫ్‌నర్సుల ఖాళీలను భర్తీ చేయాలి. విషపూరితమైన పని వాతావరణాన్ని నివారించాలి.

ప్రైవేటు ఆస్పత్రికి వెళ్లా...



నేను జ్వరంతో బాధపడుతున్నా. చికిత్స కోసమని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళితే.. అక్కడ వైద్యులు లేరు. సమ్మెలో ఉన్నారని చెప్పారు. చేసేదిలేక ప్రైవేటు ఆస్పత్రికి వెళ్లి చూపించుకున్నా. నాతో పాటు ఇతర రోగులూ వెనుదిరిగారు. వైద్యుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించి మాలాంటోళ్లకు ఇబ్బంది లేకుండా చూడాలి.

– గాదీరప్ప, అమరాపురం

యూరియా కోసం ఘెరావ్



అధికారులను చుట్టుముట్టిన రైతులు

పుట్టపర్తి అర్బన్: యూరియా కోసం వ్యవసాయ అధికారులను జగరాజుపల్లి, వెంకటగారిపల్లి రైతులు ఘెరావ్ చేశారు. సోమవారం మండలంలోని జగరాజుపల్లికి ఏఓ శ్రీలక్ష్మి, ఏఈఓ ఆనంద్‌నాయక్ వెళ్లగా.. రైతులు చుట్టుముట్టి యూరియా పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. ఇందుకు వారు టోకెన్లు ఇచ్చి మంగళవారం యూరియా అందజేస్తామని చెప్పారు. ఇటీవల రేషనలైజేషన్ పేరుతో వెంకటగారిపల్లిలోని ఆర్‌ఎస్‌కే సిబ్బందిని మరో కేంద్రానికి పంపగా.. ఆ గ్రామంలోని ఆర్‌ఎస్‌కే మూతపడింది. దీంతో తమ గ్రామానికి యూరియా కావాలని వెంకటగారిపల్లి గ్రామస్తులు అడ్డుకున్నారు. మంగళవారం ఒక లోడు యూరియా వస్తుందని అధికారులు సర్దిచెప్పారు.

చందమామ తొంగిచూసె.. నంది దరహాసం ఒలకబోసె



తాడిపత్రి పట్టణంలో సోమవారం సాయంత్రం అద్భుత దృశ్యం ఆవిష్కృతమైంది. చిరుజల్లులు కురిసి ఆకాశం మేఘావృతమైన సమయంలో నెలవంక చుట్టూ చేరిన వెలుగు చూపరులను ఆకట్టుకోగా.. అదే సమయంలో పురాతన బుగ్గ రామలింగేశ్వరస్వామి ఆలయం వద్ద నంది విగ్రహం చంద్రుడి వెలుగులో చూపరులను ఆకర్షించింది. – తాడిపత్రిటౌన్:

పార్టీ శ్రేణులకు అండగా డిజిటల్ బుక్

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ చరణ్

గోరంట్ల: పార్టీ శ్రేణులకు అండగా ఉండేందుకు జగనన్న డిజిటల్ బుక్ ప్రారంభించారని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు, పెనుకొండ నియోజకవర్గ పార్టీ సమన్వయకర్త ఉషశ్రీ చరణ్ తెలిపారు. కూటమి ప్రభుత్వ విధానాల కారణంగా ఎవరికైనా ఇబ్బందులు ఎదురైతే వాటిని డిజిటల్ బుక్‌లో నమోదు చేసుకోవాలని, పార్టీ తప్పకుండా అండగా నిలుస్తుందని స్పష్టం చేశారు. సోమవారం మండలంలోని వానవోలు గ్రామంలో ఉషశ్రీచరణ్ ఆధ్వర్యంలో కాఫీవిత్ వైఎస్సార్‌సీపీ కార్యక్రమం నిర్వహించారు. ఆమె పార్టీ శ్రేణులతో కలసి గడప గడపకూ వెళ్లి సూపర్ సిక్స్ హామీలను అమలు చేయకుండా కూటమి ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిన విధానాన్ని వివరించారు.



వానవోలులో డిజిటల్ బుక్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఉషశ్రీచరణ్, పార్టీ నాయకులు

వైఎస్సార్‌సీపీ అధికారంలో ఉన్నప్పుడు జగన్ మోహన్‌రెడ్డి కుల, మత, రాజకీయాలకు అతీతంగా ప్రజలందరికీ మేలు చేశారని గుర్తు చేశారు. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత శాంతి భద్రతలు పూర్తిగా క్షీణించాయన్నారు. రాష్ట్రంలో రెడ్‌బుక్ పాలన సాగుతోందని దుయ్యబట్టారు. వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, నాయకులపై అక్రమ కేసులు బనాయించి కూటమి నేతలు పైశాచిక ఆనందం పొందుతున్నారన్నారు. అనంతరం గ్రామస్తుల సమక్షంలో పార్టీ శ్రేణులతో కలసి డిజిటల్ బుక్ పోస్టర్లను ఆవిష్కరించారు. పార్టీ మండల కన్వీనర్ వెంకటేశు, వానవోలు సింగిల్‌విండో మాజీ అధ్యక్షుడు రాజేంద్ర ప్రసాద్, మండలంలోని పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కుల గణన తర్వాతే ‘స్థానిక’ ఎన్నికలు

- సీపీఐ జాతీయ కార్యదర్శి రామకృష్ణ డిమాండ్
- హామీలను నెరవేర్చలేక పోతున్నాం : ఎంపీ బీకే

సాక్షి, పుట్టపర్తి/ పుట్టపర్తి టౌన్: రాష్ట్రంలో కుల గణన ప్రక్రియ పూర్తి చేసిన తర్వాతనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వాన్ని సీపీఐ జాతీయ కార్యదర్శి రామకృష్ణ డిమాండ్ చేశారు. కుల గణన అంశంపై సోమవారం పుట్టపర్తిలోని సాయి ఆరామంలో సీపీఐ ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వేమయ్య అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో రామకృష్ణ మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా 143 వెనుకబడిన కులాలు ఉన్నాయని, స్థానిక సంస్థల ఎన్నికలలో బీసీలకు కేటాయించిన స్థానాలు తగ్గడంతో అవకాశాలను కోల్పోవాల్సి వస్తోందని తెలిపారు. ఈ అంశంలో ప్రభుత్వంపై బీసీ సంఘాలు ఒత్తిడి తీసుకొచ్చి హక్కులను కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి రమేష్‌గౌడ్ మాట్లాడుతూ బీసీల రక్షణ చట్టం తీసుకొస్తామంటూ ఎన్నికలకు ముందు హామీనిచ్చిన కూటమి పెద్దలు అధికారం చేపట్టిన తర్వాత ఆ ఊసే మరచిపోయారన్నారు. కులగణన చేపట్టిన అనంతరమే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు.



మాట్లాడుతున్న రామకృష్ణ, చిత్రంలో ఎంపీ బీకే, రమేష్‌గౌడ్, వేమయ్య, జగదీష్ తదితరులు

నెరవేర్చలేని స్థితిలో ఉన్నాం..

ఎన్నికల హామీలను నెరవేర్చలేని మాట వాస్తవమేనని హిందూపురం టీడీపీ ఎంపీ బీకే పార్థసారథి అంగీకరించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగో లేనందున హామీల అమలు కష్టంగా ఉందన్నారు. బీసీల అంశాలను పార్లమెంటులో ప్రస్తావిస్తానన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కేటీ శ్రీధర్, టీడీపీ జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ, సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జగదీష్, నాయకులు పైపల్లి గంగాధర్, బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు కొట్టాల శ్రీరాములు, బీసీ ఉద్యోగుల సంఘం జిల్లా నాయకుడు చంద్రమోహన్, చేతివృత్తుల సంఘం నాయకుడు జింకా చలపతి తదితరులు పాల్గొన్నారు.

తిండి గింజలకూ తిప్పలే!

కదిరి పట్టణంలోని ఆర్‌ఎస్ రోడ్డుకు చెందిన బీబీ వయసు 82 ఏళ్లు. 65 ఏళ్ల పైబడిన వృద్ధులకు ఇంటి వద్దకే రేషన్ ఇస్తామని కూటమి ప్రభుత్వం చెప్పడంతో ఈమె నిజమే అనుకుంది. కానీ సదరు డీలర్ తన అనుచరుణ్ని ఆమె ఇంటికి పంపి గత నెలలో రేషన్ కోసం వేలి ముద్ర వేయించుకున్నాడు. బియ్యం మాత్రం ఇవ్వలేదు. ఇదేమని అడిగితే వచ్చే నెల ఇస్తామని అక్కడి నుంచి వెళ్లిపోయాడు.

చిలమత్తూరు మండల కేంద్రానికి చెందిన దివ్యాంగుడు నరసింహులు వయసు 69 ఏళ్లు. రేషన్ బియ్యం డీలరే ఇంటికి తెచ్చిస్తాడని ఎదురు చూసి... చివరకు ఆయనే స్టోరుకు వెళ్లక తప్పలేదు. బియ్యం కోసం వెళ్లాలంటే ప్రతి నెలా ఆటోకు రానుపోను రూ.80 ఖర్చు అవుతోందని అంటున్నాడు. ఇలాంటి వారు ఒకరు కాదు..ఇద్దరు కాదు.. జిల్లా వ్యాప్తంగా వేలాది మంది ఉన్నారు.

- వృద్ధులు, దివ్యాంగులకు ఇంటి వద్దకే రేషన్ ఉత్తిదే
- సుదూరం నుంచి రాలేక అవస్థలు పడుతున్న వృద్ధులు
- సాయం చేసేవారు లేక దివ్యాంగుల ఎదురు చూపులు
- వేలిముద్రలతో సరిపెడుతున్న స్టోర్ డీలర్లు

“65 ఏళ్లు పైబడిన వృద్ధులు, దివ్యాంగులు, అనారోగ్యంతో మంచానికే పరిమితమైన వారికి రేషన్ డీలర్ ద్వారా వారి ఇంటికే బియ్యం డెలివరీ చేస్తాం. అది కూడా ఒకటో తేదీ రాక మునుపే.. అంటే ముందు నెల 26 నుంచి 30వ తేదీ వరకూ ఐదు రోజుల పాటు ఈ ప్రక్రియ కొనసాగిస్తాం.''

– ఇదీ రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ప్రకటన.

వాస్తవానికి ఇది ప్రకటనకే పరిమితమైంది. ఎక్కడా ఆచరణకు నోచుకోలేదు.



ఎన్‌పీకుంట మండల కేంద్రంలో ఓ చౌక దుకాణం వద్ద రేషన్ కోసం వృద్ధుల పడిగాపులు

కదిరి: గత ప్రభుత్వం అన్ని వర్గాల వారికీ ఇంటి దగ్గరే రేషన్ బియ్యం పంపిణీ చేసింది. కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఇంటింటికీ రేషన్ పంపిణీకి మంగళం పాడింది. దీనివల్ల రాష్ట్ర వ్యాప్తంగా మొబైల్ డిస్పెన్సింగ్ యూనిట్ (ఎండీయూ) వాహనాల ద్వారా రేషన్ పంపిణీ చేసే 18 వేల కుటుంబాలు రోడ్డున పడ్డాయి. ఇందులో జిల్లాకు చెందిన కుటుంబాలు 349 ఉన్నాయి. 65 ఏళ్లు పైబడిన వృద్ధులు, దివ్యాంగులతో పాటు మంచానికి పరిమితమైన వారికి రేషన్ బియ్యం డోర్ డెలివరీ చేస్తామని కూటమి ప్రభుత్వం గొప్పలు చెప్పింది. కానీ జిల్లా వ్యాప్తంగా క్షేత్ర స్థాయిలో ఎక్కడా అమలు కావడంలేదు. వృద్ధులు జీవిత చరమాంకంలో ఊతకర్రల సాయంతో ఎన్నో వ్యయ ప్రయాసలకోర్చి చౌక బియ్యం తెచ్చుకుంటున్నారు. బియ్యం సంచిని భుజంపై కూడా పెట్టుకోలేని స్థితిలో చుట్టుపక్కల వారిని సాయం కోసం బతిమాలుకుంటున్నారు.

వేలిముద్రలు సరే.. బియ్యం ఏదీ?

జిల్లాలో కొన్ని చోట్ల రేషన్ డీలర్లు దివ్యాంగులు, వృద్ధుల ఇంటి దగ్గరకు వెళ్లి రేషన్ బియ్యం పంపిణీ చేసినట్లు వేలిముద్రలు తీసుకుంటున్నారు. కానీ వారికి అక్కడ బియ్యం ఇవ్వడం లేదు. కుటుంబ సభ్యులు లేదా బంధువులెవరైనా చౌక డిపో వద్దకు వస్తే గానీ ఇచ్చేది లేదని తెగేసి చెబుతున్నారు. ఇంకొందరు డీలర్లు వేలి ముద్రలు వేయించుకోవడంతోనే సరిపెట్టి.. బియ్యం వచ్చే నెలలో ఇస్తామంటున్నారు. వారి కోటా బియ్యాన్ని పక్కదారి పట్టించి సొమ్ము చేసుకుంటున్నారు.

జిల్లా గణాంకాలు

1,367 రేషన్ దుకాణాలు	5,62,784 రేషన్ కార్డులు
63,286 దివ్యాంగులు, వృద్ధులు, మంచం పట్టినవారు	8,700 (మెట్రిక్ టన్నులు) నెలలో పంపిణీ చేసే బియ్యం

అప్పుడే బాగుండె



ముసలోళ్లకు ఇంటి దగ్గరకే స్టోర్ బీము తెచ్చిస్తామని సెంద్రబాబు, ఇంకా శానా మంది సెప్పినారు. కానీ తెచ్చింది లేదు.. ఇచ్చిందీ లేదు. ఊతకట్టె లేందే నడవలేను. ఇంక బీము తెచ్చుకునేది ఎక్కడ? జగనే మేలు. ఈళ్లు, వాళ్లు అనకుండా అందరికీ ఇంటికే బీము పంపిస్తా ఉండె.

– ఎ.నరసింహులు, నల్లచెరువు మండలం

చర్యలు తప్పవు



దివ్యాంగులు, 65 ఏళ్లు పైబడిన వృద్ధులు, మంచానికి పరిమితమైన వారికి ఇళ్ల దగ్గరకే వెళ్లి నిత్యావసర సరుకులు ఇవ్వాలి. ప్రతి చౌక డిపో డీలర్ దీన్ని తప్పక పాటించాల్సిందే. ఎక్కడైనా ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు. రుజువైతే డీలర్‌షిప్‌ను కూడా రద్దు చేస్తాం. తూకాల్లో మోసాలు చేసే వారిని ఉపేక్షించేది లేదు.

– వంశీకృష్ణారెడ్డి, జిల్లా పౌరసరఫరాల అధికారి

తూకంలో మోసాలు..

జిల్లా వ్యాప్తంగా 1,367 రేషన్ దుకాణాలుండగా.. వీటి పరిధిలో 5,62,784 రేషన్ కార్డులు ఉన్నాయి. కార్డుదారుల్లో 63,286 మంది 65 ఏళ్లు పైబడిన వృద్ధులు, దివ్యాంగులు, అనారోగ్యంతో మంచం పట్టిన వారు ఉన్నారు. మనిషికి ఐదు కిలోల చొప్పున రేషన్ బియ్యం, కార్డుకు అర కిలో చొప్పున చక్కెర పంపిణీ చేస్తున్నారు. గత ప్రభుత్వంలో ఇంటి దగ్గరకే వెళ్లి కచ్చితమైన తూకాలతో రేషన్ బియ్యం అందజేసేవారు. కూటమి ప్రభుత్వంలో మెజార్టీ చౌకడిపో డీలర్లు అధికార పార్టీ వారే కావడంతో తూకాల్లో మోసాలకు పాల్పడుతున్నారు. కళ్లెదుటే మోసాలకు పాల్పడుతున్నా సామాన్య ప్రజలు అడగలేని పరిస్థితి. ఒకవేళ ఎవరైనా ఫిర్యాదు చేస్తే..అధికారులు తనిఖీకి వస్తున్నారనే సమాచారం సదరు డీలర్‌కు ముందే తెలిసిపోతోంది.

మహాగౌరీ పాహిమాం

శరన్నవరాత్రి ఉత్సవాలు జిల్లా వ్యాప్తంగా అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. సోమవారం ఆయా ప్రాంతాల్లోని అమ్మవారి ఆలయాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. వివిధ రూపాల్లో అమ్మవార్లు కొలువుదీరారు. భక్తులు ఆలయాలకు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు.

– సాక్షిబృందం:



రొళ్ల : మహాగౌరిగా కొల్హాపురి మహాలక్ష్మీదేవి

మహిళలు, చిన్నారుల రక్షణే ధ్యేయం

- ఎస్పీ సతీష్‌కుమార్



పుట్టపర్తి టౌన్: జిల్లాలోని మహిళలు, చిన్నారుల రక్షణే మొదటి కర్తవ్యంగా భావిస్తూ పోక్సో కేసుల్లో ముద్దాయిలకు శిక్ష పడేలా చూస్తామని ఎస్పీ సతీష్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. జిల్లా వ్యాప్తంగా బాలికలు, చిన్నారులకు సంబంధించి 2024 జూన్ నుంచి ఈ ఏడాది ఇప్పటి వరకు 110 కేసులు నమోదయ్యాయని, ఇందులో 79 పోక్సో, 31 మిస్సింగ్ కేసులు ఉన్నాయని పేర్కొన్నారు. రామగిరి మండలంలో పోక్సో కేసుకు సంబంధించిన ముద్దాయిలను జైలుకు పంపినట్లు తెలిపారు. బాల్య వివాహాల నివారణకు గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు.

యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు

పుట్టపర్తి టౌన్: జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో సిల్క్ డెవలప్‌మెంట్ సంస్థ ద్వారా నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించనున్నారు. ఈ మేరకు స్కిల్ డెవలప్‌మెంట్ జిల్లా మేనేజర్ సూర్యనారాయణ సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఇంటర్ పూర్తి, 19 నుంచి 26 సంవత్సరాల మధ్య వయసున్న యువతీయువకులు అర్హులు. 90 రోజుల పాటు అనంతపురంలోని టీటీడీసీ శిక్షణ అనంతరం ధ్రువీకరణ పత్రాన్ని అందజేయడంతో పాటు ప్రముఖ ప్రైవేట్ కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నారు. శిక్షణ సమయంలో ఉచిత భోజనం, వసతి సౌకర్యం కల్పిస్తారు. అక్టోబర్ 3 నుంచి శిక్షణ తరగతులు ప్రారంభం కానున్నాయి. ఆసక్తి ఉన్న వారు 96408 99337లో సంప్రదించవచ్చు.

ముగిసిన వాలీబాల్ పోటీలు

హిందూపురం టౌన్: స్థానిక ఎంజీఎం క్రీడా మైదానంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు మనోజ్ జూలియట్ (మింటూ) ఆధ్వర్యంలో రెండు రోజులుగా సాగుతున్న వాలీబాల్ పోటీలు ఆదివారం రాత్రి ముగిసాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పట్టణ టూ టౌన్ సీఐ కరీం పాల్గొని, మాట్లాడారు. విద్యార్థి దశలోనే శారీరక, మానసిక దృఢత్వాన్ని పొంది, చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. ఔత్సాహిక క్రీడాకారుల ప్రతిభను ప్రోత్సహించడం కోసం పట్టణంలో క్రీడా పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. అనంతరం టోర్నీ విజేతగా నిలిచిన హిందూపురం ఎంజీఎం స్ట్రైకర్స్, రన్నర్‌గా నిలిచిన గోరీబిదనూర్ శాంతినగర్ జట్లకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో విశ్రాంత ఎస్‌ఐ లోకేష్, లైఫ్ వరల్డ్ చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధి ఉదయ్‌కుమార్, పీఈటీలు చిన్న కొండప్ప, వెంకటేష్, బ్రహ్మయ్య, జీఆర్పీ కానిస్టేబుల్ శీన, సిరాజ్, ఉమర్ ఫరూక్, శ్రీరాములు, శాంతరాజు, తదితరులు పాల్గొన్నారు.

బరిలో దిగితే.. విధ్వంసమే!

- క్రికెట్‌లో రాణిస్తున్న జిల్లా వాసులు
- భారత మహిళా క్రికెట్ జట్టులో అనూష
- ఇప్పటికే పలువురు రంజీ జట్టుకు ప్రాతినిథ్యం
- తాజాగా దూసుకొస్తున్న మరికొందరు

ప్రపంచవ్యాప్తంగా మిలియన్ల మంది ప్రజల అభిమాన క్రీడగా మారిన క్రికెట్‌లో ఉమ్మడి జిల్లాకు చెందిన పలువురు క్రీడాకారులు రాణిస్తున్నారు. సాధారణంగా విధ్వంస రచన చేసే టీ20 ఫార్మాట్‌లో విజయాన్ని శాసించే స్థాయికి బౌలర్లు ఎదిగారు. గెలుపే ఆకాంక్షగా బ్యాటింగ్ బరిలో దిగితే పరుగుల వర్షం కురిపిస్తున్నారు.





గిరినాథ రెడ్డి



డీబీ ప్రశాంత్‌కుమార్



మల్లికార్జున



వినయ్‌కుమార్

అనంతపురం: ప్రపంచ వ్యాప్తంగా యమ క్రేజీ ఉన్న క్రికెట్‌లో అనంతపురం జిల్లా క్రీడాకారులు ప్రతిభ కనబరుస్తూ రంజీ, దేశవాళీ టోర్నీల్లో రాణిస్తున్నారు. ఏపీఎల్ (ఆంధ్ర ప్రీమియర్ లీగ్) లోనూ అదరగొడుతున్నారు. పురుషులే కాదు ..మహిళలు కూడా తాము ఎందులోనూ తీసిపోమని సత్తా చాటుతున్నారు. ముఖ్యంగా ఆర్డీటీ అందిస్తున్న శిక్షణతో రాటు దేలిన క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో తమ సత్తా చాటుతున్నారు.

బాల్ వేస్తే.. వికెట్ గిరగిరా..

గిరినాథరెడ్డి మంచి ఆల్‌రౌండర్. అండర్–25 విభాగంలో ఆంధ్రప్రదేశ్ జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించాడు. ఏపీఎల్‌లో రాయలసీమ కింగ్స్ జట్టుకు కెప్టెన్‌గా ఉన్నాడు. కుడిచేతి బ్యాట్స్‌మెన్, మీడియం పేస్ బౌలింగ్‌తో ఆల్‌రౌండర్‌గా రాణిస్తున్నాడు. అండర్–23లో మధ్యప్రదేశ్ జట్టుపై 7 వికెట్లు తీసిన రికార్డు ఉంది. శ్రీసత్యసాయి జిల్లా కదిరి ప్రాంతానికి చెందిన గిరినాథరెడ్డి మంచి ఆల్‌రౌండర్‌గా గుర్తింపు దక్కించుకున్నాడు.

మల్లి బౌలింగ్‌తో ప్రత్యర్థి బెంబేలు

రాప్తాడుకు చెందిన మల్లికార్జున ఎడమ చేతి స్పిన్నర్. ఆంధ్ర తరఫున అండర్–16లో సిక్కింపై 8, గోవాపై 7 వికెట్లు కూలదోశాడు. అండర్–19 కేటగిరిలో బెంగాల్‌పై 7 వికెట్లు తీసి ఉత్తమ బౌలర్‌గా గుర్తింపు పొందాడు. బీసీసీఐ అండర్–16 టోర్నీలో అత్యధికంగా 38 వికెట్లు తీసిన రెండో క్రీడాకారుడిగా ఖ్యాతి దక్కించుకున్నాడు. ఏపీఎల్‌లోనూ రాణిస్తున్నాడు.

'ప్రశాంత'ంగా ఆడేస్తూ..

డీబీ ప్రశాంత్‌కుమార్ ఆంధ్ర ప్రీమియర్ లీగ్‌లో సెంచరీ సాధించాడు. రంజీ ట్రోఫీలో 85 మ్యాచ్‌లు ఆడిన అనుభవం ఉంది. హిమాచల్‌ప్రదేశ్‌పై ఆడిన మ్యాచ్‌లో 189 పరుగులు సాధించాడు. కుడిచేతి ఓపెనింగ్ బ్యాట్స్‌మెన్ అయిన డీబీ ప్రశాంత్‌కుమార్ బరిలో ఉన్నంత సేపూ ప్రశాంతంగా ఆడుతూ ప్రత్యర్థి జట్టు విజయాకాశాలను దెబ్బ తీయడంలో దిట్టగా పేరుగాంచాడు.

బౌలింగ్ మాయాజాలం

కురుగుంట గ్రామానికి చెందిన ఎలక్ట్రికల్ డైలీ వర్కర్ రవి, ఆయన భార్య నారాయణమ్మ తాము పడుతున్న కష్టం తమ బిడ్డ వినయ్‌కుమార్ పడకూడదని భావించారు. చదువుతో పాటు క్రికెట్‌లోనూ శిక్షణ ఇప్పించారు. వారి నమ్మకాన్ని వినయ్‌కుమార్ వమ్ము చేయలేదు. 2013 నుంచి 2017 వరకు అనంతపురం క్రికెట్ అకాడమీలో శిక్షణ తీసుకున్నాడు. ఆర్డీటీ కోచ్‌లు నరేష్, ఆర్.కుమార్ వద్ద మెలకువలు నేర్చుకుని, అండర్–19, 23, 25 టోర్నీలతో పాటు రంజీ ట్రోఫీ మ్యాచ్‌ల్లోనూ తిరుగులేని ప్రతిభను చాటాడు. తన బౌలింగ్ మాయాజాలంతో హజరా ట్రోఫీలో ఏకంగా 6 వికెట్లు తీసి సత్తా చాటాడు.

అనూష.. అనంత అణిముత్యం



నార్పల మండలం బండ్లపల్లి గ్రామానికి చెందిన బి.అనూష.. భారత మహిళా జట్టుకు ప్రాతినిధ్యం వహించారు. ఆర్డీటీలోని క్రికెట్ అకాడమీలో శిక్షణ తీసుకున్నారు. ఎడమ చేతి లెగ్ స్పిన్నర్, కుడి చేతి బ్యాటింగ్ ఆమె ప్రత్యేకత. క్రీడా కోటా కింద ప్రస్తుతం సికింద్రాబాద్‌లోని రైల్వేలో టికెట్ కలెక్టర్‌గా పనిచేస్తోంది. ఆంధ్రా టీ–20 టోర్నీలో ప్రస్తుతం ప్రాతినిధ్యం వహిస్తోంది. అత్యధిక వికెట్లు సాధించిన క్రీడాకారిణిగా గుర్తింపు పొందారు. భారత మహిళా జట్టులో చోటు దక్కించుకున్న తొలి జిల్లా క్రీడాకారిణిగా అనూష... అనంత అణిముత్యంగా నిలిచింది.

అర్జున్.. రన్ మెషీన్



కుడిచేతి ఓపెనింగ్ బ్యాట్స్‌మెన్‌గా అర్జున్ టెండూలకర్ సత్తా చాటుతున్నాడు. అండర్ –19 , అండర్–23 కేటగిరిలో రాణించాడు. సీనియర్ వన్డే అంతర జిల్లా టోర్నీలో 127 పరుగులు సాధించాడు. రెండు అర్ధ సెంచరీలు చేశాడు. కుడి చేతి ఆఫ్ స్పిన్నర్‌గా ఆల్‌రౌండర్ ప్రతిభ చాడుతున్న అర్జున్ టెండుల్కర్ స్వగ్రామం ధర్మవరం మండలం గొట్లూరు గ్రామం.

పింఛన్ల పంపిణీ సజావుగా సాగేనా?

- రేపటి నుంచి పింఛన్ల పంపిణీ

పుట్టపర్తి అర్బన్: సచివాలయ సిబ్బంది నిరసనలు, ధర్నాలతో పాటు ఇటీవల సమ్మె నోటీసులు ఇవ్వడంతో ఈ సారి పింఛన్ల పంపిణీ సజావుగా సాగే పరిస్థితులు కనిపించడం లేదు. అక్టోబర్ 1వ తేదీన పింఛన్లను పంపిణీ చేయాల్సి ఉంది. తమ సమస్యలు పరిష్కారం అయ్యే వరకూ ఈ నెల 26న కమిషనర్‌కు వినతి పత్రం ఇస్తూ ఇంటింటికీ తిరిగి పింఛన్లు అందజేయబోమని జేఏసీ సభ్యులు తేల్చి చెప్పారు. అలాగే 27న కలెక్టర్‌ను కలసి పింఛన్ పంపిణీ చేయబోమని విన్నవించారు. ఈ క్రమంలో 29న పింఛన్ నగదును బ్యాంకుల నుంచి విత్ డ్రా చేయకుండా నిరాకరించారు. 30న వివిధ ప్రసార మాధ్యమాల ద్వారా పింఛన్ పంపిణీ చేయబోమని లబ్ధిదారులకు విషయాన్ని చేరవేయనున్నట్లు జేఏసీ సభ్యులు తెలిపారు. 1వ తేదీన అధికారులు పింఛన్ మొత్తాన్ని సచివాలయ ఉద్యోగులకు అందజేస్తే బుధవారం ఉదయం 10.30 గంటలకు సచివాలయాల వద్దనే పంపిణీ చేయాలని నిర్ణయించుకున్నారు. ఇదే జరిగితే జిల్లాలోని 2,63,987 మంది పింఛన్ లబ్ధిదారులకు ఇబ్బందులు తప్పవు. కాగా, జిల్లాలోని లబ్ధిదారులకు 1వ తేదీన పింఛన్ పంపిణీ చేయనున్నట్లు కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ మొత్తాన్ని అక్టోబర్ 1వ తేదీ, 3వ తేదీ మాత్రమే పంపిణీ చేస్తామన్నారు. 2వ తేదీ గాంధీ జయంతి, దసరా పండుగల సందర్భంగా పంపిణీ ప్రక్రియ ఉండదన్నారు.

ఆటో నుంచి కింద పడి వివాహిత మృతి



నందిని మృతదేహం

రొద్దం: ఆటో నుంచి కింద పడి ఓ వివాహిత మృతి చెందింది. పోలీసులు తెలిపిన మేరకు.. రొద్దం మండలం పెద్దకోడిపల్లి గ్రామానికి చెందిన బోయ పోతన్న భార్య నందిని(30) వ్యవసాయ కూలి పనులతో కుటుంబానికి చేదోడుగా నిలిచింది. ఈ క్రమంలో ఆర్.లోచెర్ల గ్రామానికి చెందిన ఆటోలో గ్రామంలో సహ కూలీలతో కలసి ఉదయం 7 గంటలకు బయలుదేని మోపుర్లపల్లిలో కూలి పనులు ముగించుకుని తిరిగి అదే ఆటోలో ఇంటికి చేరుకునేది. ఈ క్రమంలో సోమవారం ఉదయం పనులకు ఆటోలో బయల్దేరిన ఆమె డ్రైవర్ పక్కన సీటులో కూర్చొని ప్రయాణిస్తోంది. సుబ్బరాయప్ప కొట్టాల వద్దకు చేరుకోగానే డ్రైవర్ అతి వేగంగా, అజాగ్రత్తగా వాహనాన్ని నడపడంతో పట్టు తప్పి కిందపడడంతో తలకు లోతైన గాయమైంది. స్థానికులు వెంటనే రొద్దంలోని పీహెచ్‌సీకి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతురాలికి ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

హత్య కేసు దర్యాప్తులో అన్యాయం

- హతుడి తల్లిదండ్రుల ఆవేదన
- న్యాయం చేయాలంటూ ఎస్పీకి ఫిర్యాదు
- పరిష్కార వేదికకు 70 వినతులు



ఎస్పీకి ఫిర్యాదు చేస్తున్న హతుడి తల్లిదండ్రులు మంగమ్మ, నారాయణ నాయక్

పుట్టపర్తి టౌన్: తమ కుమారుడిని ముగ్గురు కలసి హతమారిస్తే విచారణను పెడదోవ పట్టించి కోడలిని మాత్రమే అరెస్ట్ చేశారని, మిగిలిన ఇద్దరిని స్వేచ్ఛగా వదిలేశారంటూ హతుడి తల్లిదండ్రులు మంగమ్మ బాయి, నారాయణనాయక్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు డీపీఓలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఎస్పీ సతీష్‌కుమార్‌ను కలసి ఫిర్యాదు చేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. పుట్టపర్తి మున్సిపాల్టీ పరిధిలోని బ్రాహ్మణపల్లి గ్రామ సమీపంలో ఉన్న జగన్న కాలనీలో నివాసం ఉంటున్న తమ కుమారుడు బాలాజీ నాయక్‌ను ఈ నెల 15న దారుణంగా హతమార్చారన్నారు. భార్య గాయత్రి బాయితో పాటు మహమ్మద్ అలీ, అంజీనాయక్ తమ కుమారుడిని హతమార్చినట్లుగా అప్పట్లో పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. ఘటనపై పుట్టపర్తి అర్బన్ పోలీసులు కేసు నమోదు చేసి, గాయత్రీబాయితో పాటు మరో ఇద్దరిని అదుపులోకి తీసుకుని విచారణ చేశారన్నారు. అయితే హంతకులతో డబ్బు తీసుకుని దర్యాప్తును పెడదోవ పట్టించి గాయత్రీబాయిని మాత్రమే హంతకురాలిగా నిర్ధారిస్తూ కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించారని, మిగిలిన ఇద్దరినీ స్వేచ్ఛగా వదిలేశారని ఆవేదన వ్యక్తం చేశారు. లోతైన విచారణ చేపట్టి తమ కుమారుడిని హతమార్చిన ఏ ఒక్కరినీ వదిలిపెట్టకుండా కఠిన శిక్ష పడేలా చేయాలని ఎస్పీకి విన్నవించామన్నారు. స్పందించిన ఎస్పీ.. లోతైన విచారణ చేపట్టి న్యాయం చేయాలంటూ పుట్టపర్తి పోలీసులను ఆదేశించారన్నారు.

వివిధ సమస్యలపై 70 వినతులు..

జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదికకు వివిధ సమస్యలపై 70 వినతులు అందాయి. ఎస్పీ సతీష్ కుమార్ స్వయంగా వినతులు స్వీకరించి, బాధితులతో మాట్లాడారు. సమస్య తీవ్రత తెలుసుకుని చట్టపరిధిలోని అంశాలకు తక్షణ పరిష్కారం చూపాలంటూ సంబంధిత ఎస్‌హెచ్‌ఓలను ఆదేశించారు. కార్యక్రమంలో లీగల్ అడ్వైజర్ సాయినాథ్ రెడ్డి, డీసీఆర్‌బీ సీఐ శ్రీనివాసులు, ఎస్‌బీ సీఐ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

గార్లదిన్నె: రైలు కిందపడబోయిన యువకుడిని లోకో పైలెట్ సకాలంలో గుర్తించి, ప్రమాదం నుంచి కాపాడాడు. వివరాలు.. కర్నూలు జిల్లాకు చెందిన వెంకటేష్‌కు గార్లదిన్నె మండలం యర్రగుంట్ల గ్రామానికి చెందిన యువతితో వివాహమైంది. ఇటీవల భార్య గొడవపడి పుట్టింటికి చేరుకుంది. దీంతో వెంకటేష్ సోమవారం యర్రగుంట్లకు చేరుకుని భార్యను కాపురానికి రావాలని అభ్యర్థించాడు. ఆమె నిరాకరించడంతో జీవితంపై విరక్తి చెంది గార్లదిన్నెలోని డ్యాం రోడ్డు రైల్వే గేట్ సమీపంలో ప్యాసింజర్ రైలు కిందపడబోయాడు. గమనించిన లోకో పైలెట్ రైలు వేగాన్ని నియంత్రించడంతో అప్రమత్తమైన స్థానికులు వెంటనే వెంకటేష్‌ను పట్టాల పైనుంచి పక్కకు లాగేశారు.

మడకశిరలో విషాదం

- ఈతకెళ్లి ఇద్దరు యువకుల మృతి



మృతి చెందిన బాబ్జాన్, మున్వర్

మడకశిర: నియోజకవర్గ కేంద్రంలో విషాదం చోటు చేసుకుంది. శుభకార్యానికి వచ్చిన ఇద్దరు యువకులు ఈత కెళ్లి నీట మునిగి మృతి చెందారు. వివరాలు... కర్ణాటకలోని హాజన్‌కు చెందిన బాబ్జాన్ (34), మున్వర్ (23) వారి బంధువుల పెళ్లి వేడుకలో పాల్గొనేందుకు ఆదివారం మడకశిరకు వచ్చారు. సోమవారం బంధువులందరూ కలసి సరదాగా చెరువు ప్రాంతానికి సమీపంలో ఉన్న స్విమ్మింగ్ పూల్‌లో ఈత కొట్టేందుకు వెళ్లారు. కాసేపటి తర్వాత అందరూ బయటకు వచ్చినా.. బాబ్జాన్, మున్వర్ మాత్రం రాలేదు. దీంతో బంధువులకు అనుమానం వచ్చి స్విమ్మింగ్ పూల్‌లో గాలింపు చేపట్టారు. పూల్ కింద భాగంలో యువకులిద్దరూ ఇరుక్కుపోయినట్లుగా గుర్తించి విషయాన్ని వెంటనే స్విమ్మింగ్ పూల్ నిర్వాహకులకు తెలపడంతో వారు నీటిలో దిగి బాబ్జాన్, మున్వర్‌ను వెలికి తీశారు. అప్పటికే వారు మృతి చెందినట్లు గుర్తించిన బంధువుల రోదనలతో ఆ ప్రాంతం మార్మోగింది. స్విమ్మింగ్ పూల్‌లో అధికంగా పాచి కట్టి ఉండడంతో ఇద్దరు యువకులు అందులో ఇరుక్కుపోయి మృతి చెందినట్లుగా మృతుల బంధువులు తెలిపారు. ఈ విషయంలో పోలీసులు సమగ్ర దర్యాప్తు జరిపి మృతుల కుటుంబాలకు న్యాయం చేయాలని వారు కోరారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. కాగా, బాబ్జాన్‌కు భార్య, ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. మున్వర్‌కు వివాహం కాలేదు.

డిమాండ్ల సాధనకు ఉద్యమాలే శరణ్యం

- ఫ్యాప్టో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మల్లు రఘునాథరెడ్డి



మాట్లాడుతున్న మల్లు రఘునాథరెడ్డి

పుట్టపర్తి: ఉద్యోగ, ఉపాధ్యాయుల, పెన్షనర్ల సమస్యల పరిష్కారంపై పాలకుల్లో కదలిక రావాలంటే ఉద్యమాలే శరణ్యమని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ఫ్యాప్టో) రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మల్లు రఘునాథరెడ్డి అన్నారు. సోమవారం కొత్తచెరువులోని బాలుర ఉన్నత పాఠశాలలో జిల్లా ఫ్యాప్టో సన్నాహక సమావేశం జరిగింది. ఫ్యాప్టో జిల్లా చైర్మన్ గజ్జల హరిప్రసాదరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి పరిశీలకులుగా హాజరైన రఘునాథరెడ్డి మాట్లాడుతూ.. ఏకీకృత సర్వీసు రూల్స్ సమస్యను పరిష్కరించి విద్యాశాఖలో 72, 73, 74 జీఓలు అమలు చేయాలన్నారు. పంచాయతీరాజ్ యాజమాన్యంలో పెండింగ్ లో ఉన్న కారుణ్య నియామకాలు తక్షణమే చేపట్టాలన్నారు. కేంద్ర మెమో 57ను అమలుపరుస్తూ 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ అమలు చేయాలన్నారు. ఉపాధ్యాయులకు బోధనేతర పనుల నుండి విముక్తి కలిగించాలన్నారు. 12వ వేతన సవరణ సంఘాన్ని నియమించి వెంటనే 30 శాతం మధ్యంతర భృతి ప్రకటించాలన్నారు. పెండింగ్ లో ఉన్న డీఏలు, సంపాదిత సెలవు బిల్లులు విడుదల చేయాలన్నారు. ఎంటీఎస్ ఉపాధ్యాయులను రెగ్యులరైజ్ చేయాలన్నారు. ఆంగ్ల మాధ్యమానికి సమాంతరంగా తెలుగు మాధ్యమాన్ని కూడా కొనసాగించాలన్నారు. డిమాండ్ల సాధనకు ఫ్యాప్టో ఆధ్వర్యంలో అక్టోబర్ 7న విజయవాడలో తలపెట్టిన 'చలో విజయవాడ–పోరుబాట' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ ఉద్యమం ప్రభుత్వానికి కనువిప్పు కలిగేలా ఉండాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యుడు ఆర్.చంద్ర, బడా హరిప్రసాదరెడ్డి, ఎస్టీయూ ప్రధాన కార్యదర్శి కోనంకి చంద్రశేఖర్, షమీవుల్లా, జిల్లా ప్రధానోపాధ్యాయుల సంఘం ప్రధానకార్యదర్శి గోపాల్, రామకృష్ణ, గోపాల్ నాయక్, మాధవ్, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్‌ఏ లైసెన్స్ పునరుద్ధరించాలి

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ



ఆర్డీటీ ఆస్పత్రిలో అందుతున్న సేవలపై రోగులతో ఆరా తీస్తున్న కె.రామకృష్ణ

బత్తలపల్లి: పేదల పెన్నిధిగా ఉన్న ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్‌ఏను పునరుద్ధరించాలని కేంద్ర ప్రభుత్వాన్ని సీపీఐ జాతీయ కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే కె.రామకృష్ణ డిమాండ్ చేశారు. బత్తలపల్లిలోని ఆర్డీటీ ఆస్పత్రిని స్థానిక సీపీఐ నేతలతో కలసి సోమవారం ఆయన సందర్శించారు. అక్కడ అందుతున్న సేవలపై రోగులతో ఆరా తీశారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా గత 56 సంవత్సరాలుగా వివిధ రంగాలలో ఆర్డీటీ అందిస్తున్న సేవలను కొనియాడారు. పేదల జీవన ప్రమాణాలు పెంచడమే లక్ష్యంగా కృషి చేస్తున్న ఆర్డీటీకి విదేశీ నిధులు అందకుండా అడ్డుకోవడం బాధాకరమన్నారు. కరోనా కష్టకాలంలోనూ ఆర్డీటీ అందించిన సేవలు మరువలేమన్నారు. సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ ప్రత్యేక చొరవ తీసుకుని ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్‌షాతో చర్చించి ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్‌ఏ పునరుద్ధరించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. లేకపోతే ఉద్యమాలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి వేమయ్య, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు డి.జగదీష్, రైతు సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కాటమయ్య, పలువురు నాయకులు పాల్గొన్నారు.

కేంద్రం దృష్టికి టీచర్ల సమస్యలు

పుట్టపర్తి అర్బన్: టెట్ నుంచి ఇన్ సర్వీస్ టీచర్లను మినహాయించే అంశాన్ని కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళుతానని రామకృష్ణ పేర్కొన్నారు. పుట్టపర్తికి విచ్చేసిన ఆయనను ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రఘునాథరెడ్డి ఆధ్వర్యంలో పలువురు ఉపాధ్యాయులు కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడారు. టీచర్ల సర్వీస్ రూల్స్ సమస్యలను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఎస్టీయూ చిత్తూరు జిల్లా అధ్యక్షుడు హరిప్రసాద్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్, గోపాల్‌నాయక్, తదితరులు పాల్గొన్నారు.

శిథిలాలు మీదపడి కార్మికుడి మృతి



వెంకటరమణ (ఫైల్)

ఓడీచెరువు (అమడగూరు): పాత ఇంటిని తొలగిస్తుండగా శిథిలాల మీద పడి ఓ భవన నిర్మాణ కార్మికుడు మృతిచెందాడు. అమడగూరు మండలం ఎ.కొత్తపల్లి గ్రామానికి చెందిన మంజుల వెంకటరమణ (70) కూలీ పనులతో జీవనం సాగిస్తున్నాడు. తన స్వగ్రామంలో ఓ పాత ఇంటిని తొలగించే పనిలో నిమగ్నమై ఉండగా... ప్రమాదవశాత్తు గోడ కూలి మీద పడింది. కుటుంబసభ్యులు వెంటనే ప్రైవేట్ వాహనంలో కదిరిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యుల సూచన మేరకు అనంతపురానికి తరలిస్తుండగా మార్గ మధ్యంలో మృతి చెందాడు.

యువకుడి దుర్మరణం



అశోక్ మృతదేహం

రొళ్ల: మండల పరిధిలోని 544ఈ జాతీయ రహదారిపై సోమవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు దుర్మరణం పాలయ్యాడు. పోలీసుల వివరాల మేరకు... రొళ్ల మండలం మళ్లసముద్రానికి చెందిన అశోక్ (25) ఉపాధి నిమిత్తం బెంగళూరు వెళ్లాడు. సోమవారం బెంగళూరు నుంచి స్వగ్రామానికి ద్విచక్ర వాహనంలో బయలుదేరాడు. మరోవైపు పావగడ నుంచి కర్ణాటక రాష్ట్రం కడూరుకు కోళ్ల లోడ్‌తో ఐచర్ వాహనం వెళ్తోంది. అయితే గుడిబండకు వెళ్లే నాలుగు రోడ్ల కూడలి వద్ద అశోక్ ద్విచక్ర వాహనంలో రోడ్డు దాటుతుండగా అటు నుంచి వచ్చిన ఐచర్ వాహనం ఢీ కొని బోల్తాపడింది. అశోక్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఏఎస్‌ఐ హిదాయతుల్లా దర్యాప్తు చేపట్టారు.